క్లుప్తంగా

అవగాహనతో రోడ్డు ప్రమాదాల నియంత్రణ



జిల్లేడుపూడిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వెలుగు అధికారులు

నాతవరం: రోడ్డు ప్రమాదాలపై వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలని వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి అన్నారు. మండల కేంద్రం జిల్లేడుపూడిలో మంగళవారం వెలుగు అధ్వర్యంలో రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకప్పుడు పట్టణ ప్రాంతాల్లో మాత్రమే వాహనాల రద్దీ ఉండేదని, ప్రస్తుతం గ్రామాల్లో కూడా ఇంటికో వాహనం ఉందన్నారు. చాలా మందికి డ్రైవింగ్‌పై కనీస అవగాహన లేకపోవడంతో, మితిమీరిన వేగంతో హెల్మెట్ లేకుండా ప్రయాణించి ప్రమాదాలబారిన పడుతున్నారని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తే, రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చున్నారు. కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, స్థానిక ప్రజాప్రతినిధులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

'కేంద్రం ప్రజావ్యతిరేక విధానాలు వీడాలి'



ఉపాధి కూలీలకు కరపత్రాలను అందిస్తున్న సీపీఐ నాయకులు

దేవరాపల్లి : కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో దేశానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు వేముల కన్నబాబు, మండల కార్యదర్శి గరికిన రాజు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం మండల వ్యాప్తంగా ఉపాధి కూలీలను కలిసి, కేంద్ర ప్రభుత్వ విధానాలను వివరిస్తూ, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అక్రమంగా కట్టబెడుతున్నారని ఆక్షేపించారు. గ్యాస్, పెట్రో, డీజిల్ తదితర నిత్యావసర సరకుల ధరలను విపరీతంగా పెంచి సామాన్యుడి నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో కూడా ప్రకాష్, అల్లు శ్రీను, కూడా లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు



జి.కొత్తపల్లిలో కూలీలతో మాట్లాడుతున్న ఉపాధి సిబ్బంది

చీడికాడ : ఉపాధి కూలీలు వడదెబ్బ బారిన పడకుండా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీవో జయప్రకాష్ తెలిపారు. మంగళవారం ఏపీవో నాగరాజుతో కలిసి ఆయన పలు గ్రామాల్లో పని ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు ఉదయం 5 గంటలకు పని ప్రదేశానికి చేరుకుని 10 గంటలకు పని ముగించుకుంటే వడదెబ్బకు గురికారన్నారు. పని ప్రదేశాల్లో చలువ పందిళ్లు వేయడంతో పాటు కూలీలు అధికంగా పనిలోకి వచ్చేలా చూడాలని ఉపాధి సిబ్బందికి సూచించారు.

విధిగా గ్రామ సంఘాల సమావేశం



మాట్లాడుతున్న ఏసీరాజేశ్వరి, ఏపీఎం వెంకటలక్ష్మి

కె.కోటపాడు: ప్రతి నెలా తప్పనిసరిగా గ్రామ సంఘాల, చిన్న సంఘాల సమావేశాలను నిర్వహించాలని పెందుర్తి ఏరియా వెలుగు కోఆర్డినేటర్ రాజేశ్వరి, ఏపీఎం వెంకటలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం మండలంలోని 56 వీవోఏలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరి, వెంకటలక్ష్మి మాట్లాడుతూ త్వరలోనే ఆడిట్ జరుగుతుందని, రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. రుణాలు తీసుకున్న డ్వాక్రా సభ్యులు సకాలంలో బ్యాంకులకు చెల్లించేలా వీఏవోలు సమావేశాల్లో వివరించాలన్నారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బొడ్డు జయలక్ష్మి, ఏజీఎం వెంకునాయుడు, సీసీలు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9966329167, 9912440601

జనం చెంతకే సంక్షేమం.. జగనన్నకే సాధ్యం

- డి.గొటివాడలో ఇంటింటి కుళాయిలకు రూ.1.48 కోట్లు మంజూరు
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



డి.గొటివాడలో పింఛను అందని రాజులమ్మకు నగదు అందించి, అండగా ఉంటానని భరోసా ఇస్తున్న డిప్యూటీ సీఎం



గడప గడపకు మన ప్రభుత్వంలో సంక్షేమ పథకాల లబ్ధిని స్థానికులకు వివరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల : దేశంలో ఎక్కడా లేని విధంగా ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు అన్నారు. మండలంలోని డి.గొటివాడ పంచాయతీలో ఒంటి కొంప శ్రీరాంపురం, దొర్ల గొటివాడ సమీపంలోని సీరావారి కళ్లాలులో గడప గడపకు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కుటుంబాల వారీగా చేకూరిన లబ్ధిని వివరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతిచ్చి, జగనన్నను మళ్లీ సీఎంగా చేయాలని అభ్యర్థించారు. డిప్యూటీ సీఎం రాకతో స్థానిక మహిళలు హారతులుపట్టి, దారంతా పూలు జల్లి, జై జగన్.. జై బూడి అంటూ నినాదాలు చేశారు. ఒంటి కొంప శ్రీరాంపురంలో మజ్జి అచ్చియ్యమ్మ, డి.గొటివాడలో రేఖా కొండమ్మలుతో పాటు మరో 30 మంది వృద్ధ మహిళలు తమ బిడ్డలు పట్టించుకోకపోయినా, పెద్దకొడుకు జగన్ ఇంటికే పింఛను అందించి, బాగోగులు చూసుకుంటున్నాడంటూ డిప్యూటీ సీఎం బూడి ముందు తమ ఆనందాన్ని వెలిబుచ్చారు. స్థానికుల అభ్యర్థన మేరకు గ్రామంలో పెండింగ్‌లో ఉన్న డ్రేనేజీలు, సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. దుడ్డవారి కళ్లాలకు, తాగునీటి బోరు మంజూరు చేశారు.

- శ్రీరాంపురంలో మంచి నీటి ట్యాంకుతో పాటు, ఇంటింటి కుళాయిలకు రూ.60 లక్షలు మంజూరు చేశారు. – డి.గొటివాడ, అల్లువారి కళ్లాలకు ట్యాంకుతో పాటు ఇంటింటి కుళాయిలకు మరో రూ.60 లక్షలు, శివారు గ్రామం గొల్లలపాలెం వాటర్ ట్యాంక్, ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు రూ.28 లక్షల నిధులు మంజూరు చేశారు.
- గ్రామంలో లోఓల్టేజ్ సమస్యతో ఫ్యాన్లు కూడా తిరగట్లేదని గ్రామస్తులు చెప్పడంతో వెంటనే ట్రాన్స్‌కో అధికారులతో ఫోన్లో మాట్లాడి మండలంలో ఎక్కడా ఈ సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ స్తంభాలను తక్షణమే సరిచేయాలన్నారు.
- అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. అంగన్‌వాడీ పథకాలను ఎవరు అందిస్తున్నారని చిన్నారులను అడిగితే, జగన్ మామయ్య అని వారంతా ముక్త కంఠంతో చెప్పారు. అంగన్‌వాడీ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.
- కొడుకులున్నా తనను పట్టించుకోవట్లేదని, తనకు పింఛను కూడా రాలేదని రొబ్బా రాజులమ్మ చెప్పడంతో తన జేబులో నుంచి రూ.3 వేలు నగదు అందించారు. తక్షణమే ఆమె అర్హతల్ని పరిశీలించి పింఛన్ మంజూరు చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.

కార్యక్రమంలో ఎంపీపీ వేమవరపు రామధర్మజ, జెడ్పీటీసీ కిముదు రమణమ్మ, సర్పంచ్ గోకేడ అర్జునరావు, మాజీ సర్పంచ్ అల్లు రమణ, ఎంపీటీసీ శ్రీనాదు సూర్యకాంతం, మార్కెట్ కమిటీ చైర్మన్ శేనాపతి, కొండలరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గోకేడ అప్పల నాయుడు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, ఎం.కోడూరు సర్పంచ్ గొళ్లవిల్లి సంజీవరావు, శ్రీనాదు జగ్గారావు, ఇందుకూరి నాగరాజు, కోట్ని శ్రీరామమూర్తి, పొలిమేర చిన్నారావు, తహసీల్దార్ పీవీరత్నం, ఎంపీడీవో మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే..



గడప గడపకు మన ప్రభుత్వంలో తప్పెటగుళ్లు వాయిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



పొట్టిదొరపాలెంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

- రూ.90 లక్షలతో ఇంటింటికీ కుళాయిలు
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట : గ్రామాల్లో ఉన్న ప్రజా సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకే ప్రతి గడపకూ వస్తున్నట్టు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. మంగళవారం పొట్టిదొరపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ తిరిగి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు మధ్య వ్యత్యాసాలను ప్రజలకు తెలిపారు. రానున్న ఎన్నికలకు మోసగాళ్లంతా మూకుమ్మడిగా కలిసి వస్తున్నారని, వారికి గత ఎన్నికల మాదిరిగానే గట్టిగా బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. స్థానిక సమస్యలపై ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, సంక్షేమ పథకాలు తంచనుగా అందుతున్నాయని స్థానికులు ధర్మశ్రీ వద్ద తమ ఆనందం వెలిబుచ్చారు. వచ్చే ఎన్నికల్లో కూడా సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటామని స్పష్టం చేశారు.

ఎస్సీ కాలనీ మధ్యలో ఉన్న కొండగెడ్డ మట్టి కొట్టుకుపోవడంతో గెడ్డకు ఇరువైపులా ఉన్న ఇళ్లు ప్రమాదంలోపడ్డాయని, వాటికి రక్షణ గోడను నిర్మించాలని, కాలనీలో స్టేజ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, వీధుల్లో మంచినీరు అందించాలని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ రూ.90 లక్షలతో ఇంటింటి కుళాయిల పనులు మొదలైనట్టు తెలిపారు. ఇందులో భాగంగా కొత్తగా వాటర్ ట్యాంక్ నిర్మాణం జరుగుతోందన్నారు. త్వరలోనే పనులు పూర్తి చేసి, ప్రతి ఇంటికీ కుళాయి నీరు అందిస్తామని పేర్కొన్నారు. స్టేజ్, రక్షణ గోడ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు.

కార్యక్రమంలో జెడ్పీటీసీ దొండా రాంబాబు, పార్టీ మండల అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, మండల సచివాలయ కన్వీనర్ కోరుకొండ అప్పలనాయుడు, ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు దేవర అప్పారావు, సర్పంచ్ దరిమిశెట్టి యశోద అప్పలనాయుడు, వైస్ సర్పంచ్ గుద్దేటి శ్రీను, మాజీ సర్పంచ్ రాజు, మండల వలంటీర్ల సంఘం అధ్యక్షుడు మజ్జి సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో మలేరియా నియంత్రణ



రోలుగుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



నాతవరం: వైద్యాధికారి రాజేష్‌నాయుడు ఆధ్వర్యంలో



చౌడువాడ ర్యాలీలో వైద్యాధికారి నిర్మల



కె.జె.పురం ర్యాలీలో వైద్యాధికారి లీలాప్రసాద్

- ప్రపంచ మలేరియా దినోత్సవాన ఊరూరా అవగాహన ర్యాలీలు

రోలుగుంట : మండల కేంద్రం రోలుగుంట, బుచ్చింపేట పీహెచ్‌సీ వైద్యుల ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రాల్లో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ర్యాలీలు నిర్వహించి మలేరియా ప్రబలడానికి కారణాలు, నియంత్రణ విధానాలపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రోలుగుంట వైద్యురాలు ధనలక్ష్మి, బుచ్చింపేట వైద్యురాలు సునీత మాట్లాడుతూ దోమతెరల వినియోగం, ఇంటి కిటికీలకు మెస్‌లు అమర్చడం తదితర దోమల నియంత్రణ విధానాల్ని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో రోలుగుంటలో ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజరు ఫకీర్‌నాయుడు, గ్రేస్, బుచ్చింపేటలో ఎంపీహెచ్‌ఈవో అప్పలనాయుడు, హెల్త్ అసిస్టెంట్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నాతవరం : ప్రభుత్వం మలేరియా నివారణకు అనేక చర్యలు చేపడుతోందని నాతవరం, గునుపూడి పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.రాజేష్‌నాయుడు, సురేష్ కుమార్ అన్నారు. నాతవరం, గునుపూడి కేంద్రాలలో మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మానవహారం, ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమలను నిర్మూలిద్దాం, దోమల వలన వచ్చే వ్యాధులను నివారిద్దాం అంటూ నినాదాలు చేశారు. మలేరియా జ్వరం కేవలం దోమ కాటు వలనే వస్తుందన్నారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



వేచలం: ర్యాలీలో వైద్యాధికారి హారిక, సిబ్బంది

కె.కోటపాడు : దోమకాటు వలన వచ్చే మలేరియా వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారిణి నిర్మల సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం చౌడువాడలో వైద్య సిబ్బంది, ప్రజలతో కలిసి అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ ప్రజలు ఇంటి పరిసరాలలో మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. మలేరియా నివారణకు పీహెచ్‌సీలో మందులు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. రెండు రోజులకుపైగా జ్వరం ఉంటే అందుబాటులో ఉన్న పీహెచ్‌సీలో మలేరియా వ్యాధి నిర్ధారిత పరీక్షను చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో కె.వి.రాజశేఖర్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్ : దోమ కాటుతోనే మలేరియా వ్యాధి సోకుతుందని కె.జె.పురం వైద్యాధికారి లీలా ప్రసాద్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సిబ్బందితో కలిసి అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లీలా ప్రసాద్ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో దోమల్ని నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కామేశ్వరి, ఎంపీహెచ్‌ఈవో రవికుమార్, హెచ్ఎస్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మలేరియా రహిత సమాజ నిర్మాణానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని వేచలం పీహెచ్‌సీ వైద్యాధికారి బి.హారిక అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం గ్రామంలో వైద్య సిబ్బంది, స్థానిక ప్రజలు పీహెచ్‌సీ నుంచి ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ నిర్వహించారు. దోమలను నివారిద్దాం, అంటు వ్యాధులను, మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ జ్వరాలను తరిమి కొడదాం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి బి.హారిక మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలన్నారు. ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వల వల్లే దోమలు వ్యాప్తి చెందుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా రామానుజుల జయంతి



రామానుజుల విగ్రహానికి పూజలు చేస్తున్న ఆలయ చైర్మన్ కొణతాల బాబూరావు

అనకాపల్లిటౌన్ : గ్రేటర్ విశాఖ విలీనగ్రామమైన రాజుపాలెం సూర్యనారాయణస్వామి ఆలయంలో శ్రీరామానుజుల జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఆలయ చైర్మన్ కొణతాల బాబూరావు రామానుజుల చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

అనకాపల్లిటౌన్ : దైవచింతన ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. ఆయన స్వగృహంలో మంగళవారం వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రారంభోత్సవ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన కశింకోట మండలం కన్నూరుపాలెం గ్రామంలో స్వామి వారి నూతన ఆలయ ప్రారంభించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

1/70 చట్టం భూముల రీసర్వే

- కలెక్టర్, జేసీ ఆదేశాల మేరకే సర్వే
- తహసీల్దార్ కనకారావు



1/70 చట్టం భూముల రీసర్వేపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ కనకారావు

నాతవరం : మైదాన ప్రాంతం ఐదో షెడ్యూల్ 1/70 చట్టం పరిధిలో భూములను కూడా భూ రీసర్వేలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అదేశాల మేరకు సర్వే చేయనున్నట్ట తహసీల్దార్ పి.కనకారావు వెల్లడించారు. మంగళవారం తన కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. మండలంలో సరుగుడు, చమ్మచింత, సుందరకోట, కేపీ శరభవరం, కొండధర్మవరం, కృష్ణాపురం, అగ్రహారం, మాధవనగరం అచ్చంపేట, పొట్టినాగన్నదొరపాలెం తదితర గ్రామాలలో భూములన్నీ 1/70 చట్టం పరిధిలో ఉన్నట్టు తెలిపారు. ఇంతవరకు ఆ భూముల్లో ఏ పని చేయాలన్న పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అదేశాలతో ఉమ్మడి జిల్లా కలెక్టరు ఉత్తర్వుల మేరకు చేసేవారిమని పేర్కొన్నారు. జిల్లాల విభజన తర్వాత ప్రభుత్వ నిబంధనల మేరకు 1/70 చట్టానికి భంగం కలగకుండా, భూములు సాగు చేసే రైతులకు నిబంధనల మేరకు న్యాయం చేయాలని సిబ్బందిని సూచించారు. డ్రోన్ సర్వే చేశాక సరిహద్దులో జగనన్న భూరక్ష రాళ్లు ఏర్పాటు చేస్తామన్నారు. కలెక్టర్, జేసీ, నర్సీపట్నం ఆర్డీవో అదేశాల ప్రకారం రైతుల పేరిట రికార్డులు తయారు చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, ఆర్ఐ నారాయణరావు సీనియర్ అసిస్టెంట్ డి.కృష్ణ, సర్వేయర్లు విజయ్‌కుమార్, జగదీష్, వీఆర్వోలు పాల్గొన్నారు.

'ఘనంగా వందేళ్ల మేడే'



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజు

నాతవరం: మేడే ప్రారంభమై వందేళ్లు అవుతున్న సందర్భంగా వచ్చే నెల 1(మేడే)న ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం సీఐటీయూ మండల శాఖ కార్యవర్గంతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిగ్గా వందేళ్ల క్రితం కార్మిక హక్కుల పరిరక్షణకు మేడే మొదలయిందన్నారు. రానున్న మే 1కి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా, ఈ విషయాన్ని క్షేత్రస్థాయిలో ప్రతి కార్మికునికి తెలిసేలా ప్రచారం చేసి, 1 నుంచి 15 వరకు జిల్లా వ్యాప్తంగా పలు సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు చేసేందుకు కార్యవర్గం తీర్మానించిందన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో కార్మికులను సంఘటితం చేసి, జెడా ఆవిష్కరణలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సిటూ మండల నాయకులు లక్ష్మీబాయ్, మాణిక్యం, అంగన్‌వాడీ కార్యకర్తల మండల శాఖ అధ్యక్షురాలు వసంత, కార్యదర్శి మణి, ఆశ కార్యకర్తల సంఘం నాయకురాలు అమ్మాజీ, అప్పలనర్స పాల్గొన్నారు.

ఉత్సాహంగా మా నమ్మకం నువ్వే జగన్

రోలుగుంట : మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా మంగళవారం జానకిరాంపురంలో సర్పంచ్ లగుడు కృష్ణంనాయుడు, జేపీ అగ్రహారంలో సర్పంచ్ చిటికెల పద్మ, అడ్డసరంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు విస్సారాపు కృష్ణ తదితరులు ఇంటింటా తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. గృహ యజమానుల అనుమతితో సీఎం జగన్ స్టిక్కర్లను గోడలకు అతికించారు.



అడ్డసరంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్లను అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

స్టోన్ క్రషర్ నిర్వహణకు అభిప్రాయ సేకరణ

అనకాపల్లిటౌన్: పాపయ్యసంతపాలెం గ్రామంలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి వారి ఆధ్వర్యంలో లోక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ వారి అధ్వర్యంలో మంగళవారం గ్రామ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ మాట్లాడుతూ పాపయ్యసంతపాలెం గ్రామం, సర్వే నంబర్.176లో 21.692 హెక్టార్లల్లో కలర్ గ్రానైట్‌కు 5,400 క్యూబిక్ మీటర్లు, రోడ్డుమెటల్, బిల్డింగ్ స్టెన్స్, 4,91,400 క్యూబిక్ మీటర్లు, గ్రావెల్ 48,600 క్యూబిక్ మీటర్లు, సంవత్సరానికి తవ్వకం చేపట్టడానికి గ్రామ ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టినట్టు తెలిపారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో రోడ్డు, డ్రైనేజీలు, రహదారికి ఇరువైపులా మొక్కలను నాటి, దుమ్ముధూళి రాకుండా పరిశుభ్రంగా ఉంచాలని, నెలకు ఒకసారి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, క్వారీలో గ్రామ ప్రజలకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో విశాఖ కాలుష్య నియంత్రణశాఖ అధికారి సుదర్శన్‌రావు, జిల్లా మైనింగ్ అధికారి రవివర్మ, తహసీల్దార్ గంగాధర రావు, లోక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత ఆశోక్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



ప్రజాభిప్రాయసేకరణలో మాట్లాడుతున్న గ్రామస్తుడు

'సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి'



ఎంపీపీ జగన్‌మోహన్, సర్పంచ్‌లకు సన్మానం

కె.కోటపాడు : ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రతీ గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అన్నారు. కె.కోటపాడు ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల స్థాయిలో వివిధ విభాగాల్లో ఉత్తమ పంచాయతీలకు పురస్కారాలను అందించారు. స్వయం సమృద్ధితో మౌలిక వసతుల గల గ్రామ పంచాయితీ, సమృద్ధిగా తాగునీటి లభ్యత, బాలల సానుకూలత విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు ఎంపికైన పంచాయతీల సర్పంచ్, కార్యదర్శులకు సన్మానం చేశారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్‌ను పలు గ్రామాల ప్రజాప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శచీదేవి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఏటుకూరి రాజేష్, భూమిరెడ్డి దేముళ్లు, వంటాకు శ్రీను, బండారు లక్ష్మణరావు, ఆదిరెడ్డి రామునాయుడు, శ్రీకాంత్ శ్రీను, దొగ్గ ఉమాశంకర్, ఆకుల సాయి ప్రసాద్, యడ్ల దేముళ్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాల్లో 30 మంది ఎంపిక



కంపెనీ ప్రతినిధులతో ఉద్యోగాలకు ఎంపికైన బీఆర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు

నర్సీపట్నం : ఫార్మర్ గ్రోత్ ప్రై.లి. సంస్థ నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో స్థానిక బీఆర్ కళాశాల అగ్రికల్చర్ డిప్లమో విద్యార్థులు 30 మంది ఎంపిక య్యారు. కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 40 మంది విద్యార్థులు హాజరవగా, 30 మంది ఎంపికైనట్టు కరస్పాండెంట్ బి.శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్యాంపస్ ఇంటర్వ్యూకు సంస్థ నుంచి డైరెక్టర్ స్వామి, సురేంద్ర హాజరయ్యారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల సిబ్బంది సుజాత, సురేష్‌లు అభినందించారు.

విద్యా విధానంలో లలిత కళలు భాగం కావాలి

పాయకరావుపేట : విద్యా విధానంలో లలిత కళలను ఒక భాగంగా చేసినప్పుడే విద్యార్థులకు భారతీయ సంస్కృతి, మన కళలు, ఆచారాలపై పూర్తి అవగాహన కలుగుతుందని నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఢిల్లీ ప్రొఫెసర్ అభిలాష్ పిళ్లై అన్నారు. మంగళవారం శ్రీప్రకాష్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలు విదేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాకి చెందిన నటి జిల్ మిల్ హజారికా మాట్లాడుతూ విద్యతో పాటు నాట్యం, అభినయం తదితర రంగాల్లో యువత ఆసక్తి చూపాలన్నారు. కార్యక్రమంలో ఇన్నోవేటివ్ థియేటర్ డైరెక్టర్ డాక్టర్ తూము శివప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వీర్రాజు, డైరెక్టర్ హెచ్ఆర్ డాక్టర్ బంగ్గారాజు, వైస్ ప్రిన్సిపాల్ సుబ్బారావు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com